

ఎన్నికల నిమయావళిని పక్కాగా అమలు చేయాలి

-కలెక్టర్ సత్యప్రసాద్



పత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

మెట్‌పల్లి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిమయాలను పక్కాగా అమలు చేయాలని రిటర్నింగ్ అధికారులకు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. శనివారం మండలంలోని మేడిపల్లి, బండలింగాపూర్, వెల్లుల్ల గ్రామాల్లోని నామినేషన్ స్వీకరణ కేంద్రాలను సందర్శించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద ఎలక్షన్ నోటీస్ బోర్డు, ఓటర్ల జాబితా, హెల్ప్ డెస్క్‌లను పరిశీలించినంతరం నామినేషన్ పత్రాలను ఎంత మంది స్వీకరించారని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హెల్ప్ డెస్క్, పోలీస్ బందోబస్తు, సరిపడా సపోర్టింగ్ స్టాఫ్ ఉన్నారా అని, నోటీసు బోర్డులపై అతికించిన పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ప్రశాంత వాతావరణంలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ స్వీకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా రిటర్నింగ్ అధికారులు చూడాలన్నారు. నామినేషన్లను ఈనెల 30న పరిశీలన ఉంటుందని, డిసెంబర్ 3 వరకు ఉపసంహరణ గడువు ఉందన్నారు. మొదటి విడుతలో 7 మండలాల్లోని 122 గ్రామాల సర్పంచులు, 1172 వార్డు మెంబర్లకు డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్ జరిగిన అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కించి ఫలితాలు వెల్లడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు శ్రీనివాస్, జివాకర్‌రెడ్డి, తహసీల్దార్ నీత, ఎంపీడీవో సురేష్, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, ఆర్‌వోలు, ఏఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

●**కోరుట్ల:** మండలంలోని యూసుఫ్‌నగర్ క్లస్టర్ పరిధిలో నామినేషన్ స్వీకరణ కేంద్రంను కలెక్టర్ సత్యప్రసాద్ కోరుట్ల ఆర్‌డీఓ జీవకర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాంలో ఏర్పాటు చేసి హెల్ప్ డెస్క్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఎంపీడీవో రామకృష్ణతో పాటు ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్య తీసుకోవాలి

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ బాధ్యులు డీఈవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మెట్‌పల్లి, కొడిమ్యాల మండలంలో ఉన్న పాఠశాలలు కనీస మౌలిక సదుపాయాలు లేకుండా, నిబంధనలు పాటించకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలు పాటించని పాఠశాలల ఎదుట ధర్నా నిర్వహించి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ బాధ్యులు సాభిద్, రేవంత్, గణేష్, మనోహర్, అఫ్రోజ్ తదితరులున్నారు.

సంక్షేమ పథకాలపై రైతులకు అవగాహన

భీమారం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలో పాడి రైతులకు శనివారం కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో పలు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కల్యాణ లక్ష్మి, పాడి రైతు భరోసా, స్కాలర్‌షిప్, పాడి సంక్షేమ నిధి, విద్యార్థులకు విద్యా ప్రోత్సాహకాలు, సబ్సిడీ రుణాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ గండ్ర రవీందర్ రావు, డాక్టర్ చిట్టిమల్ల రాములు, సూపర్‌వైజర్ రాజేష్, రమేష్, పాల కేంద్రం నిర్వాహకుడు పల్లి భీమయ్య, డెయిరీ అధ్యక్షుడు లైశెట్టి నర్సయ్య, పాడి రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

రాయికల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన కొండ రాజేశ్వరికి మంజూరైన రూ.16,500 విలువ గల సీఎం సహాయనిధి చెక్కును శనివారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అందజేశారు. నిరుపేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఆరెంజ్ డే వేడుకలు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మిషన్ కాంపౌండ్‌లోగల స్లేట్ స్కూల్‌లో ఆరెంజ్‌డే వేడుకలను శనివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న మాట్లాడుతూ ప్రతీ రంగుకు ఓ ప్రాముఖ్యత ఉంటుందన్నారు. విద్యార్థులకు రంగులపై అవగాహన కల్పించడంతో పాటు రంగుల ప్రాముఖ్యతను వివరించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులంతా ఆరెంజ్ దుస్తులు ధరించడం పలువురిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జగన్మోహన్ రెడ్డి, డైరెక్టర్లు తిరుపతిరెడ్డి, రాజ్యలక్ష్మిరెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

కొడిమ్యాల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో శనివారం 8వ వార్షికోత్సవాన్ని అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారి సన్నిధిలో పడి పూజ నిర్వహించారు. ఆలయంలోని దేవతా మూర్తులకు అభిషేకం చేశారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అయ్యప్ప ఆలయానికి మండల కేంద్రానికి చెందిన బల్ల మల్లేశం ఆవును అందించారు. సేవా సమితి ఆధ్వర్యంలో గ్రామస్థులకు భక్తులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సుమారు 40 మంది స్వాములు పాల్గొన్నారు.

వేడెక్కిన రాజకీయం





- ప్రచార వ్యూహాల్లో పంచాయతీ అభ్యర్థులు..
- ముగిసిన తొలి విడత నామినేషన్లు
- రాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ
- నేటి నుంచి మలి విడత స్వీకరణ

జగిత్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల తొలి విడతకు సంబంధించిన నామినేషన్ల గడువు శనివారం ముగిసింది. దీంతో గ్రామాల్లో రాజకీయం వేడెక్కింది. తొలి విడతలో 122 గ్రామ పంచాయతీలు, 1,172 వార్డుల్లో నామినేషన్లు స్వీకరించారు. సర్పంచ్ స్థానాలకు రాత్రి 11 గంటల వరకు 773 నామినే షన్లు రాగా వార్డులకు 2,243 వచ్చాయి. ఈనెల 30వ తేదీన నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటు అయిన నామినేషన్ల వివరాలను అధికారులు వెల్లడిస్తారు. డిసెంబరు 1వ తేదీన అప్పీళ్ల స్వీకరణ, డిసెంబరు 2వ తేదీన అప్పీళ్ల పరిష్కారం ఉంటుంది. డిసెంబరు 3వ తేదీన నామినేషన్ల ఉప సంహ రణ, అదే రోజు పోటీలో ఉండే అభ్యర్థుల ప్రక టన, డిసెంబరు 11న పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచ్ ఎన్నిక ఉంటుంది.

రాత్రి వరకు కొనసాగిన నామినేషన్లు...

జిల్లాలోని పలు మండలాల్లో నామినేషన్ల ప్రక్రియ రాత్రి 9 గంటల వరకు కొనసాగింది. పలు గ్రామాల్లో పోటీ చేయడానికి పదుల సంఖ్యలో అభ్యర్థులుండడంతో నామినేషన్ల దాఖలు ప్రక్రియ రాత్రి వరకు జరిగింది. సాయంత్ర 5 గంటల వరకు నామినేషన్ల గడువు ముగిసింది. ఆ సమయానికి క్యూలో ఉన్న అభ్యర్థులకు టోకెన్లు జారీ చేసి నామినేషన్ల దాఖలు అనుమతిచ్చారు. జిల్లాలోని ఇబ్రహీంపట్నం క్లస్టర్‌తో పాటు పలు ప్రాంతాల్లో రాత్రి పూట నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది.

ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంపై దృష్టి

పంచాయతీ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించడానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించుకోవడానికి ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు, పంచాయతీ అభ్యర్థులు వ్యూహరచన జరుపుతున్నారు. ఎన్నికలకు నామినేషన్ల దాఖలు ప్రకియ పూర్తి కావడం, నామినేషన్ల ఉపసంహరణ, గుర్తులు కేటాయించనుండడం వంటి పనులు మిగిలి ఉండడం, ప్రచారానికి కొద్ది రోజులు గడువు ఉండడంతో అభ్యర్థులు ప్రదానంగా ప్రచారం వైపు దృష్టి సారిస్తున్నారు. అభ్యర్థులు ఏర్పాటు చేసుకోవల్సిన ప్రచార సామగ్రిని గ్రామస్థాయి నాయకులకు నియోజకవర్గ స్థాయి నేతలు వివరిస్తున్నారు. ఓటర్లను ఆకర్షించడానికి పలు విషయాలను వివరిస్తూ ఇప్పటి వరకు తమ పార్టీ ప్రజాప్రతినిధులు జరిపిన అభివృద్ధిని గుర్తు చేయడానికి పార్టీలు సన్నద్ధం అవుతున్నాయి. పోలింగ్‌బూత్‌ల వారీగా బాధ్యులను నియామకం చేసి ఎప్పటికప్పుడు ప్రచారాన్ని పర్యవేక్షించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. తమతమ వర్గానికి అనుకూలంగా ఉండే గ్రామానికి చెందిన ముఖ్య నాయకులను, కార్యకర్తలను బూత్‌ల వారీగా బాధ్యులుగా ఉంచడానికి పరిస్థితులను పరిశీలిస్తున్నారు. ఆయా పోలింగ్ బూత్‌ల వారీగా గల ఓటర్లకు పలు విషయాలు వివరించి ఓట్లు సంపాదించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. పంచాయతీలోని బీడీ కార్మికులు, స్త్రీలు, మైనారిటీ ఓటర్లను ఆకర్షించడానికి అనుగుణంగా అభ్యర్థులు వ్యూహరచన జరుపుతున్నాయి. ప్రచారం తీరు, వినియోగించాల్సిన వాహనాలు, మిగతా 8లో

మలి విడత మండలాలు	పంచాయతీలు	వార్డులు	పోలింగ్ స్టేషన్లు	ఓటర్లు
జగిత్యాల	5	50	50	9,727
జగిత్యాల రూరల్	29	26	268	46,020
రాయికల్	32	276	276	39,412
సారంగపూర్	18	144	144	20,466
బీర్‌పూర్	17	136	136	17,738
మల్యాల	19	186	186	40,307
కొడిమ్యాల	24	216	216	38,422
మొత్తం	144	1,276	1,276	2,12,092

పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

జగిత్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజగౌడ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో జిల్లా అదనపు కలెక్టర్ రాజాగౌడ్ ఆధ్వర్యంలో ఆర్వోలకు, ఏఆర్వోలకు ఫేజ్ 3 శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ ట్రైనింగ్ కార్యక్రమాన్ని వీడియో పవర్ ప్రెజెంటేషన్ ద్వారా అవగహన కల్పిస్తూ ఎన్నికల విధుల పట్ల దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రాజాగౌడ్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలంటే నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో నామినేషన్లు చాలా ముఖ్యమైన అంశమని, దీని పైన చాలా కేసులు దాఖలు అయ్యే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి అంశం నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలని తెలిపారు. అధికారిక ప్రకారం మాత్రమే రిజ ర్వేషన్ అంశాలను పరిశీలించాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పీళ్ళ పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటి చేసే అభ్యర్థుల ప్రకటన పక డ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల్లో పోటీచేయు అభ్యర్థులకు సంబంధించిన కరపత్రాలు, గోడ పత్రాలు, ప్రచార వాహనాల అను మతులను తీసుకోవాలంటే సంబంధిత మండల తహసీల్దార్లను సంప్రదిం చాలని తెలిపారు. అభ్యర్థుల యొక్క అన్ని వివరాలు నామినేషన్ పత్రాలలో పూర్తిగా నమోదు చేయాలని, లేనట్లయితే తిరస్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధు సుధన్, జిల్లా వ్యయ పరిశీలకులు జన రల్ అబ్జర్వర్ జి. రమేష్, డీఈవో రాము, మదన్ మోహన్, రేవంత్, డీపై ఎస్‌వో రవి, జిల్లా నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ అమరుల త్యాగాలు చిరస్మరణీయం

-బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జగిత్యాల టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అమరవీరుల త్యాగాలు మరువలేనివని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. కేసీఆర్ 2009 నవంబరు 29న చేపట్టిన అమరణ నిరాహార దీక్షా తెలంగాణ చరిత్రలోనే కాదు.. భారత రాజకీయాల్లో ఒక మహత్తర మలుపు అని అన్నారు. దీక్షా దివస్ సందర్భంగా శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కార్యాలంలో నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం విద్యాసాగర్ రావు మాట్లాడుతూ కేసీఆర్ చేపట్టిన దీక్షా ప్రజల్లో పెరిగిన తెలంగాణ ఆత్మగౌరవ జ్వాలను మరింత రగిలించి, సమూహ స్ఫూర్తిని పెంచి, చివరికి తెలంగాణ రాష్ట్ర సాధనకు బాటలు వేసిందని గుర్తు చేశారు. నవంబరు 29, 2009లో కరీంనగర్ నుంచి సిద్దిపేట దీక్షా శిబిరంకు వెళ్తున్న కేసీఆర్‌ని కరీంనగర్‌లో అరెస్ట్ చేసిన జైల్లో కూడా దీక్షా చేసి కేంద్ర ప్రభుత్వం ద్వారా తెలంగాణ ప్రకటన చేస్తున్నామని చెప్పడం దీక్షా ఫలితమే అని అన్నారు. కార్యక్రమంలో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్, డిసిఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, మాజి మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపు రెడ్డి, ధర్మపురి మాజి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, మాజి కౌన్సిలర్లు దేవేందర్ నాయక్, అవారి శివాకేసరి బాబు, రాజేష్ పాల్గొన్నారు.

పట్టణ సమగ్ర అభివృద్ధికి సర్వే

మెట్‌పల్లి టౌన్, నవంబరు29(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణ సమాగ్రాభివృద్ధికి చేపట్టిన సర్వే హైదరాబాద్‌లోని డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారుల ఆదేశాల మేరకు శనివారం అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్వే అధికారులు పట్టణంలోని 26 వార్డులను క్షేత్రస్థాయిలో సర్వేలు చేయనున్నారు. ఈ డేటా సేకరణలో మౌళిక సదు పాయాల వివరాలు, రోడ్లు, నీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, ఇంటి నెంబర్, ఇంటి యజమాని, ప్రాంతం తదితర అంశాలను పొందుపర్చనున్నట్లు వారు పేర్కొన్నారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా ఈ సర్వే నిర్వహిస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలు సహాయ సహకారాలు అందించాలని మున్సిపాలిటీ అధికారులు కోరారు.

హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది



మాట్లాడుతున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి ఉందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల కుల గణన మేరకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని అసెంబ్లీలో బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ పార్టీల ఎమ్మెల్యేలు అందరు కలిసి తీర్మానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ గురించి తీర్మానం చేసిన సమ యంలో ప్రతిపక్ష హోదాలో ఉన్న మాజీ సీఎం కేసీఆర్ కనీసం ముఖం కూడా చూపలేదని ఆయన విమర్శించారు. బీసీల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం అంటూ 42 శాతం రిజర్వేషన్ సాధించి తీరుతామని ఆయన అన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల కోసం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభించిన రోజు హైకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికలు నిలిపి వేయడం జరిగిందని ఆయన తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీలు అందరు కలిసి చర్చించి, సుప్రీం కోర్టులో తమ వాదనలు వినిపిస్తామని ఆయన వివరించారు. రాష్ట్ర కాంగ్రెస్ రథ సారధి బీసీ బిడ్డ మహేష్‌కుమార్‌గౌడ్ నాయకత్వంలో జగిత్యాల డీసీసీ అధ్యక్షులుగా మూడు పర్యాయాలు సర్పంచ్‌గా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేసిన గాజంగి నందయ్యను ఏఐసీసీ నాయకులు నియమిం చడం జరిగిందని ఆయన తెలిపారు. ఆది నుండి అన్ని వర్గాల పక్షాన నిలబడ్డ సీఎం రేవంత్‌రెడ్డి పక్కన ఒక దళిత, ఒక ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన మంత్రులుగా తాను, సీతక్క, సురేఖ, శ్రీహరి కూర్చొని ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పక్కన కేటీఆర్, హరీష్‌రావు, కవిత, సంతోష్ రావు, ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి కూర్చొని ఉంటే దళితులు, బీసీలు, ఎస్టీలకు స్థానం లేదని ఆయన విమర్శించారు. బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్, హరీష్‌రావుకు లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అందెశ్రీ మృతి చెందితే పాడె మోసిన వ్యక్తి సీఎం రేవంత్‌రెడ్డి అంటూ ప్రజా క్షేత్రంలో ఆయనకు తిరుగు లేదని మంత్రి తెలిపారు. కొండగట్టు బస్సు ప్రమాదం జరిగి 60 మంది వ్యక్తులకు పైగా మృతి చెందితే సీఎం హోదాలో ఉన్న కేసీఆర్ కనీసం పరామర్శించడానికి కూడా రాలేదని ఆయన అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్య క్షులు సంగనభట్ల దినేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాందేని మొగిలి, ప్రసాద్ పాల్గొన్నారు.

వడ్డీ రాయితీ వచ్చేదెన్నడో..?

- పట్టణ మహిళా సంఘాల్లో నిరాశ
- ఇటీవల గ్రామీణ సంఘాలకు రూ.10.69 కోట్లు వడ్డీ మాఫీ
- అర్బన్ ప్రాంతాల్లో రూ.3.10 కోట్లు పెండింగ్ 8లో..

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కలెక్టర్ సత్యప్రసాద్

విద్యార్థుల్లో శాస్త్రీయ జ్ఞానాన్ని పెంపొందించాలి

8లో..

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మల్లాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్, జిల్లా పంచాయతీ ఎన్నికల రాష్ట్ర పరిశీలకులు రమేష్ సూచించారు. శనివారం విద్యాధికారులతో కలిసి మల్లాపూర్‌లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నన భోజనంను విద్యార్థులకు కలిపిస్తున్న పలు సౌకర్యాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడినారు. నిర్వాహకులకు పలు సూచనలు చేసినారు. ఉత్తీర్ణత సాధించేందుకు విద్యా బోధనపై ఉపాధ్యాయ బృందంకు ఆయన పలు సూచనలు చేశారు.

శబరిమలకు ప్రత్యేక రైలు సౌకర్యం కల్పించాలి

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జగిత్యాల నుంచి శబరిమలకు ప్రత్యేక రైలు సౌకర్యం కల్పించాలని కోరుతూ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి బోగోజి ముఖేష్ ఖన్నా వినతిపత్రం సమర్పించారు. నాందేడ్ వయా జగిత్యాల, కరీంనగర్ మీదుగా శబరిమల వరకు ప్రత్యేక రైలు సౌకర్యం కల్పించాలని ఆయన విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు నందయ్య, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్‌లు గిరి నాగభూషణం, అడువాల జ్యోతి లక్ష్మణ్, తో పాటు అయ్యప్పస్వాములు రాము, మహేష్, సన్నీ కుమార్, రాజేందర్‌లున్నారు.

బీజేపీలో చేరిక

కథలాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిరికొండకు చెందిన సింగిల్ విండో డైరెక్టర్ నాంపల్లి శ్రీధర్ శనివారం బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరారు. ఈ మేరకు రాజన్న సిరిసిల్ల బీజేపీ అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్టు పేర్కొన్నారు. బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, మాజీ అధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, పిడుగు ఆనంద్‌రెడ్డి, బద్రి సత్యం, గాంధారి శ్రీనివాస్, కాశోజీ ప్రతాప్ ఉన్నారు.

'కృత్యాధార బోధనతో సత్ఫలితాలు సాధించాలి'



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కృత్యాధార బోధనలతో సత్ఫలితాలు సాధించవచ్చునని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. వీక్లిబజారు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐదు రోజుల పాటు పూర్వప్రాథమిక శిక్షణ కార్యక్రమం నిర్వహించగా, ముగింపు కార్యక్రమానికి డీఈవో రాము ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా పూర్వ ప్రాథమిక విద్యపై నూతన నియామకం పొందిన టీచర్లకు వివిధ అంశాలపై లోకాస్ట్, నోకాస్ట్ బోధనోపకరణాలు తయారు చేయు విధానం, ఐదు రకాల డొమైన్ కృత్యాలు, 8బ్లాక్ ఆటలు, పాటలు, కృత్యాధార బోధనల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి కొక్కుల రాజేష్, పాఠశాల హెచ్‌ఎం విజయకుమారి, ఎస్‌ఆర్పీ గుండు విజయ్‌కుమార్, జిల్లా ఆర్పీలు జూపాక సుదర్శన్, చింతకుంట వేణుగోపాల్, కోదాడి శ్రీనివాస్, నీలం సంపత్, సుంకవర రాజేష్, మామిడిశెట్టి సాగర్, అంజయ్యతో పాటు ఉపాధ్యాయ శిక్షణార్థులు పాల్గొన్నారు.ఎస్సీ విద్యార్థులకు రాజీవ్ విద్యా దీవెనపథకం కింద ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఉపకారవేతనాలు అందిస్తున్నట్లు డీఈవో రాము తెలిపారు. కొత్త పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో 5నుంచి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతి ఎస్సీ విద్యార్థికి తప్పనిసరిగా స్కాలర్‌షిప్ పొందేలా బాధ్యత వహించాలని సూచించారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాలరూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పొలాస సెక్షన్ ఏఈ సుందర్ రైతులకు సూచించారు. శనివారం మండలంలోని పొలాసలో పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లైన్‌ఇన్‌స్పెక్టర్ బి. రవిశంకర్‌రావు, పొలాస ఏఎల్‌ఎం మహేష్ పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

రాయికల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్ గ్రామంలో మొక్కజొన్న, పసుపు, పల్లి పంటలను పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు పరిశీలించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతిని గమనించి క్లోరంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా ఇమా మేక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ పి.స్పందన, వై.స్వాతి, శ్రీలక్ష్మి, ఏఈవో సతీష్, కొల్లూరి నర్సయ్య, భూమయ్య, నరేష్, రైతులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి వివాహిత ఆత్మహత్య

జమ్మికుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కేశవపూర్‌కు చెందిన పాతకాల విజయరాణి(35) అనే వివాహిత గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. కేశవపూర్‌కు చెందిన పాతకాల కిరణ్ కుమార్‌కు మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణపూర్‌కు చెందిన విజయరాణితో 16ఏళ్ల క్రితం వివాహమైంది. కిరణ్‌కుమార్ పెయింటింగ్ పనిచేస్తున్నాడు. ఆడబ్బులు కటుంబ పోషణకు సరిపోవడం లేదని విజయరాణి తండ్రికి చెప్పుకుంటూ బాధపడేది. దీంతో తల్లిదండ్రులు ఈనెల27న కుమార్తెను చూసేందుకు కేశవపూర్‌కు వచ్చారు. 28న ఉదయంవారు ముందు గదిలో ఉండగా, విజయరాణి వెనుకగదిలో గడ్డిమందు తాగింది. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. విజయరాణికి భర్త, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆమె తండ్రి చంద్రయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తుచేస్తున్నట్లు పట్టణ సీఐ రామకృష్ణగౌడ్ తెలిపారు.

మియాపూర్‌లో ఒకరి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం మియాపూర్ గ్రామానికి చెందిన కొయ్యడ అరుణ్ శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. కొన్నిరోజుల నుంచి వారి కుటుంబసభ్యుల మధ్య ఇళ్లు, భూముల పంచాయితీలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అరుణ్‌తో పాటు ఆయన భార్య మాజీసర్పంచ్ స్వప్నలపై అరుణ్ తల్లి పోలీసులకు పిర్యాదు చేసింది. అయితే ఈ విషయంలో తాము కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నామని, అయినా తమను పోలీసులు పిలిపిస్తుండడంతో మనస్తాపం చెందిన తన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడని అరుణ్ భార్య మాజీసర్పంచ్ స్వప్న వీడియో విడుదల చేసింది. తన భర్త ప్రస్తుతం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్‌ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని ఆయన ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

వ్యాన్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



బోల్తాపడిన ట్రాలీ వ్యాను

పెద్దపల్లి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకల్వల శివారులో ఆర్టీసీబస్సు.. ట్రాలీవ్యాన్‌ను ఢీకొంది. దీంతో ట్రాలీవ్యాన్ బోల్తాపడగా అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపినవివరాల ప్రకారం.. కొలనూర్‌కు చెందిన ట్రాలీ వ్యాన్ మరమ్మతుల నిమిత్తం పెద్దపల్లికి వస్తోంది. పెద్దకల్వల డిగ్రీకళాశాల వద్ద యూటర్న్ తీసుకుంటుండగా కరీంనగర్‌కి వెళ్తున్న బస్ వెనుకనుంచి ఢీకొంది. దీంతోవ్యాన్‌లో ప్రయాణిస్తున్న డ్రైవర్‌వంశీకృష్ణ, రామరాజుకు తీవ్ర గాయాలు కాగా పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. రామరాజు సోదరుడు దీపక్ ఫిర్యాదుమేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

పాలకుర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బసంత్ నగర్ అల్ట్రాటెక్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. ఈసాల తక్కళ్ళపల్లి గ్రామానికి చెందిన తీగల అనిల్‌కుమార్ ద్విచక్ర వాహనంపై బసంత్‌నగర్ బస్టాండ్ నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈక్రమంలో అదుపు తప్పి అల్ట్రాటెక్ కంపనీ గోడకు ద్విచక్రవాహనం ఢీకొని కిందపడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అనిల్‌ను అటుగా వెళ్తున్న స్రవంతి అనే నర్సు సీపీఆర్ చేసింది. అనంతరం అతన్ని 108లో కరీంనగర్ తరలించారు.

ఒకరిపై పోక్సో కేసు నమోదు

సుల్తానాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. ఓ మైనర్ బాలికను ఒకవ్యక్తి(వివాహితుడు)లోబరుచుకుని కొంతకాలంగా శారీరకంగా ఉపయో గించుకున్నాడు. బాధితుల పిర్యాదు మేరకు కేసు శనివారం పోక్సో కేసు నమోదు చేసినట్లు సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. కాగా ఆవ్యక్తిపై గతంలోకూడా ఓచిన్నారి మృతికేసులో అనుమానాలు వ్యక్తమయ్యాయి. శనివారం కులపెద్దల వద్ద ఈ విషయం వెలుగుచూడగా బాలిక తరఫువారు పోలీసులను ఆశ్రయించడంతో సదరు వ్యక్తిపై పోలీసులు పోక్సోకేసు నమోదు చేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



చింతకుంటలో దగ్ధమవుతున్న గుడిసె

కథలాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం చింతకుంటలో శనివారం షార్ట్‌సర్క్యూట్‌తో వేముల శంకర్ అనే వ్యక్తికి చెందిన గుడిసె దగ్ధమైంది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. భారీగా అగ్నికీలలు ఎగిసిపడడంతో ఫైరింజన్ వచ్చి మంటలు ఆర్పివేసింది. ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, బట్టలు పూర్తిగా కాలిపోయాయి. సంఘటనా స్థలంను రెవెన్యూఅధికారులు పరిశీలించారు. కాగా బాధితకుటుంబానికి పలువురు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కోల్‌సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గోదావరిఖని వన్‌టౌన్‌సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. శనివారం రాత్రి విఠల్‌నగర్‌లో పోలీస్‌కళాబృందం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్‌వంటి మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఎవరైనాగంజాయి అమ్మినా, కొన్నా సమాచారం ఇవ్వాలని కోరారు. కాలనీల్లో స్వీయ భద్రత కోసం కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకుల పేరుతో వచ్చే నకిలీ కాల్స్ లింకులు, ఓటీపీ మోసాల గురించి స్పష్టంగా ఉండాలని, మోసాలకు గురైతే వెంటనే 1930నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్, రోడ్డు ప్రమాదాలు, గంజాయి, సైబర్‌మోసాలు, మైనర్ల డ్రైవింగ్‌పై కళాజాత బృందం ప్రజలకు అవగాహన కల్పించింది. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్ఐ అనూష, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

నేటితో ముగియనున్న గడువు

- రేపటి నుంచి కొత్త మద్యం దుకాణాలకు అనుమతి
- డిపో నుంచి మద్యం కొనుగోలుకు అనుమతి



కరీంనగర్ క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు నడుస్తున్న వైన్‌షాపు(ఏ4)ల లైసెన్స్ గడువు ఆదివారంతో ముగియనుంది. సోమవారం (డిసెంబరు 1) నుంచి కొత్త వైన్‌షాపులు అమ్మకాలు సాగించేందుకు 94 లైసెన్సీలకు అనుమతులను జారీ చేశామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి శ్రీనివాసరావు తెలిపారు. 2025 డిసెంబరు 1 నుంచి 2027 నవంబరు 30 వరకు రెండేళ్ల కాలంపాటు మద్యం అమ్మకాలు సాగించేందుకు అక్టోబరు 23న లాటరీ ద్వారా లైసెన్సీలను ఖరారు చేశారు. డిసెంబరు 1 నుంచి వైన్‌షాపుల్లో కొత్తగా లైసెన్స్‌లు పొందిన వ్యాపారులు మద్యం అమ్మకాలు సాగించేందుకు అనువుగా ఆదివారం కరీంనగర్ డిపో నుంచి మద్యం కొనుగోలుకు అనుమతులు ఇచ్చారు. ఆది వారం సెలవు దినం అయినా నెలాఖరు కావటంతోపాటు కొత్తగా ఏర్పాటు చేసు కున్న వైన్‌షాపులకు మద్యం సరఫరా చేసేందుకు మద్యం డిపో తెరచి ఉంచుతారు.

ఎక్సైజ్ ఫీజు.. బ్యాంకు గ్యారెంటీలు

మద్యం షాపుల లైసెన్స్‌లు ఖరారు అయిన తరువాత 94 వైన్‌షాపులకు ఏడాదికి 55 కోట్ల 45 లక్షల రూపాయలు లైసెన్స్‌ఫీజుకాగా ఇందులో 6వ వంతు ఎక్సైజ్ ఫీజు 9 కోట్ల 24 లక్షల 17 వేల రూపాయలు లైసెన్స్‌దారులు ప్రభుత్వానికి చెల్లించారు. ఈ మేరకు ఎక్సైజ్ అధికారులు 94 వైన్‌షాపుల లైసెన్సీలకు మొదట కన్ఫర్‌మేషన్ లెటర్లు అందజేశారు. మిగతా లైసెన్స్‌ఫీజుకు 25 నెలల వాలిడిటీతో బ్యాంక్ గ్యారంటీలు ఎక్సైజ్ సూపరింటెండెంట్లకు సమర్పించారు. వైన్‌షాపు ఏర్పాటు కోసం వచ్చిన దరఖాస్తుల ఆధారంగా షాపు స్థలాన్ని ఎక్సైజ్ అధికారులు పరిశీలించారు. నిబంధనల ప్రకారం గుడి, బడికి వంద మీటర్ల దూరం, జాతీయ రహదారికి 220 మీటర్ల దూరం, షాపునకు ఆనుకుని వంద మీటర్ల విస్తీర్ణంలో పర్మిట్ గది, తాగునీరు, మూ త్ర శాలలు, పార్కింగ్, సీసీ కెమెరాలు ఉ న్నాయని నిర్ధారించిన తరువాతనే 94 వైన్‌షాపులకు లైసెన్స్‌లను జారీ చేశారు. ఈ ప్రక్రియ శనివారంతో ముగిసింది. న వంబరు 30 రాత్రి 10 గంటలతో పాత షాపుల గడువు ముగియనుండగా ఆ షా పులకు సంబంధించిన మిగిలిపోయిన మ ద్యం స్టాక్‌ను డిపోకు అప్పగించాల్సి ఉంటుంది.

- కరీంనగర్ జిల్లాలో ప్రస్తుతం 94 వైన్‌షాపుల లైసెన్స్‌లు ఖరారు కాగా ఎక్సైజ్ శాఖకు ఏడాదికి 55 కోట్ల 45 లక్షల ఆదాయం సమకూరనున్నది. 11 వైన్‌షాపులకు 50 లక్షల వంతున 5.5 కోట్లు, మరో 40 వైన్‌షాపులకు 55 లక్షల వంతున 22 కోట్లు, 43 వైన్‌షాపులకు 65 లక్షల వంతున 27.95 కోట్ల రూపాయలు లైసెన్స్‌ఫీజు కింద సమకూరనున్నది. ఈ 94 వైన్‌షాపులు 5 లక్షల వంతున 4.7 కోట్ల రూపాయలు స్పెషల్ ఎక్సైజ్ టాక్స్‌తోపాటు, దరఖాస్తు ఫీజు రూపంలో 81.9 కోట్ల రూపాయలు, మొత్తం కలిసి మొదటి ఏడాదిలో 142.05 కోట్ల ఆదాయం సమకూరింది.

కొత్తవారికి గుడ్‌విల్‌ఇస్తూ..

కరీంనగర్ జిల్లాలో 94 వైన్‌షాపుల్లో 25 శాతం షాపులు కొత్తవారికే రావడంతో ఆ షాపులను చాలావరకు మద్యం వ్యాపా రులు లక్షల్లో గుడ్‌విల్ చెల్లించి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఒక్కో వైన్‌షాపు డిమాండ్‌ను బట్టి 50 లక్షల నుంచి కోటి రూపాయల వరకు గుడ్‌విల్ చెల్లింపులు జరిగినట్లు సమాచారం. కొ త్తగా వైన్‌షాపులు పొందినవారికి అడ్డాలు లభించక కొంత ఇబ్బంది పడ్డారు. మరి కొందరు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు.

మావోయిస్టు నేత కాశీరాం లొంగుబాటు

- 1989లో భార్యతో సహా ఉద్యమంలోకి..



సింగరావుపేట గ్రామంలోని కాశీరాం ఇల్లు

రాయికల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం సింగరావుపేట గ్రామానికి చెందిన మావోయిస్టు నేత బత్తుల కాశీరాం మహారాష్ట్ర పోలీసుల ఎదుట శుక్రవారం లొంగిపోయాడు. మావోయిస్టు ఉద్యమానికి ఆకర్షితులైన బత్తుల కాశీరాం, అతని భార్య మల్లవ్వలు ఇద్దరు కుమారులను విడిచిపెట్టి ఉద్యమంలోకి వెళ్లారు. మల్లవ్వ అనారోగ్యంతో ఉద్యమంలో ఉన్న సమయలోనే 2009లో చనిపోయింది. రాయికల్ మండలం సింగరావుపేట గ్రామానికి చెందిన బత్తుల పెద్ద రాజయ్య-పెద్ద గంగవ్వ దంపతులకు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. ఇందులో పెద్ద కుమారుడైన కాశీరాం మావోయిస్టు ఉద్యమానికి ఆకర్షితుడై భార్య మల్లవ్వతో కలిసి 1989లో మావోయిస్టు ఉద్యమంలో చేరాడు. కాశీరాం, మల్లవ్వలు ఉద్యమంలో చేరే సమయంలో ఇద్దరు కుమారులు ఐదేళ్ల వయస్సు గల పిల్లలు.

ఇద్దరు చిన్న పిల్లలను వదిలి కాశీరాం దంపతులు ఉద్యమం బాట పట్టారు. అప్పటి నుంచి ఉద్యమంలో వివిధ హోదాల్లో వీరిద్దరూ పని చేశారు. ఉద్యమంలో ఉన్నసమయలో కాశీరాం తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పలుమార్లు పిల్లల కోసమైనా జనజీవన స్రవంతిలో కలవాలని వేడుకున్నా వారు ఉద్యమాన్ని విడిచిరాలేదు. ప్రస్తుతం కాశీరాం పెద్ద కుమారుడు రాజేష్ హైదరాబాద్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తుండగా, అతని చిన్న కుమారుడు మహేష్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. మహారాష్ట్ర పోలీసులకు కాశీరాం లొంగిపోయాడన్న సమాచారం మేరకు అతడి తమ్ముడు మహాదేవయ్య మహారాష్ట్రకు వెళ్లాడు.

పోలీసుల అదుపులో చోరీకి పాల్పడిన యువకుడు?

- యువకుడికి ఫిట్స్.. ఆసుపత్రికి తరలింపు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్‌లో ట్రాలీ ఆటోను దొంగిలించిన అదే గ్రామానికి చెందిన యువకుడిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సమాచారం. విచారిస్తున్న క్రమంలో యువకుడికి ఫిట్స్ వచ్చి ఒక్కసారిగా కింద పడిపోయాడని తెలిసింది. ఆందోళనకు గురైన పోలీసులు పోలీస్ వాహనంలో మండల కేంద్రంలోని ఓ ఆసుపత్రికి తరలించారని సమాచారం. ఈ విషయంపై ఎస్ఐ రాహుల్‌రెడ్డిని వివరణ కోరగా వాహనం ఎత్తుకెళ్లారని బాధితులు తమ వద్దకు వచ్చారని పేర్కొన్నారు. బాధితుల సమీప బంధువు చోరీ చేయడంతో అతన్ని అదుపులోకి తీసుకుని మాట్లాడుతున్న క్రమంలో ఫిట్స్ రావడంతో అతని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లారని ఎస్ఐ వివరించారు.

తల్లీకొడుకులకు కన్నీటి వీడ్కోలు

- చితికి నిప్పుపెట్టిన కుమార్తెలు

తంగళ్లపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు పాల్పడిన తల్లీ కొడుకులకు బంధువులు, మిత్రులు కన్నీటి వీడ్కోలు పలికారు. ఆత్మహత్యకు పాల్పడిన తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన మంచికట్ల లలిత ఆమె కుమారుడు అభిలాష్ అంత్యక్రియలు శనివారం నిర్వహించారు. తల్లి కొడుకుల మృత దేహాలను ట్రాక్టర్‌పై పక్కపక్కనే పెట్టి అంతిమయాత్ర చేపట్టగా దారి వెంట స్థానికులు కంటతడి పెట్టుకున్నారు. తల్లి లలిత చితికి పెద్ద కూతురు మౌనిక నిప్పుపెట్టగా, అన్నయ్య అభిలాష్ చితికి సోదరి మానస నిప్పుపెట్టింది. ఈ దృశ్యం బంధువులను, మిత్రులను కంటతడి పెట్టించింది.



అభిలాష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బెటాలియన్ కమాండెంట్ సురేష్

నివాళులర్పించిన కమాండెంట్..

తంగళ్లపల్లిలో అభిలాష్ భౌతికాయానికి 17వ బెటాలియన్ కమాండెంట్ సురేష్‌తోపాటు కానిస్టేబుళ్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లడుతూ విధి నిర్వహణలో నిబద్ధతతో, క్రమ శిక్షణతో పనిచేసిన సిబ్బందిలో అభిలాష్ ఒకరిగా నిలిచారని కొనియాడారు. ఆయన మృతి పోలీస్‌శాఖకు తీరనిలోటని పేర్కొన్నారు. అనంతరం అభిలాష్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

పథకం ప్రకారమే సిద్ధన్న హత్య

- ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలంలోని గుర్రవానిపల్లె ఎదురుగా ఉన్న అగ్రహారం గుట్టల్లో ఈ నెల 27న బల్లెపు నర్సయ్య అలియాస్ సిద్ధన్న హత్యకేసులో ప్రధాననిందితుడైన జక్కుల సంతోష్‌ను అరెస్ట్‌చేసినట్లు వేములవాడ ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలప్రకారం... జిల్లాలోని తంగళ్ల పల్లిమండలం గండిలచ్చపేట గ్రామానికి చెందిన సిద్ధన్న అప్పటి పీపుల్స్‌వార్ దళ కమాండర్‌గా పనిచేశాడు. ఈసమయంలో వీర్నపల్లి బస్టాండ్‌వద్ద 1999లో జక్కుల అంజయ్యను పోలీస్ ఇన్ఫార్మర్‌గా భావించి కాల్చివేసిన ఘటనలో అతనిపై ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఘటనపై అంజయ్య కుమారుడు జక్కుల సంతోష్ తనతండ్రిని చంపిన వ్యక్తిపై కక్షపెంచుకున్నాడు. దీంతో పథకం ప్రకారం సిద్ధన్నపై రాళ్లతో దాడిచేసి హత్యచేశాడు. ఈ ఘటనపై వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో సంతోష్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తుచేపట్టగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఇంచార్జి డిఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. ఈ హత్య కేసును చేధించిన వేములవాడటౌన్ సిఐ వీరప్రసాద్, ఎస్ఐ రామ్మోహన్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



హత్యకేసులో అరెస్ట్ అయిన సంతోష్

రాజన్న కోడెల తరలింపుపై విచారణకు ఈవో ఆదేశం

వేములవాడ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గతఏడాది జనవరిలో రాజరాజేశ్వర స్వామి దేవస్థానం తిప్పాపూర్ గోశాల నుంచి నాలుగు కోడెలను అక్రమంగా తరలించిన వ్యవహారంలో విచారణ చేపట్టాలని శనివారం ఆలయఈవో రమాదేవి అధికారులను ఆదేశించారు. వేములవాడ దేవస్థానం గోశాలనుంచి మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని దుబ్బతండాకు చెందిన సోమేశ్వర గోసంరక్షణ సేవాసంఘం ఆధ్వర్యంలో వ్యాన్‌లో కోడెలను తరలిస్తుండగా జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ వద్ద అక్రమంగా తరలిస్తున్నారని బజరంగ్‌దళ్ కార్యకర్తలు ఆపేశారు. ఈ వాహనాన్ని కార్యకర్తలు తనిఖీచేసిన సందర్భంలో 24కోడెలు ఉన్నాయి. అయితే అనుమతి మాత్రం 20కోడెలకే ఉండడంతో మరో 4కోడెలు ఎక్కడివని బజరంగ్‌దళ్ కార్యకర్తలు ప్రశ్నించారు. అదనంగా నాలుగు కోడెలు ఉండడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా అక్కడ కేసు నమోదైంది. అదే సమయంలో ఇద్దరు ఆలయ ఉద్యోగులకు చార్జి మెమో జారీకి తదుపరి చర్యలకు ఆదేశించారు. ఈ వ్యవహారంలో శాఖాపరమైన సమగ్రవిచారణ చేపట్టాలని ఏఈవోను విచారణాధికారిగా నియమిస్తూ ఈవో ఆదేశాలు జారీచేశారు.

16 మంది బైండోవర్

కరీంనగర్ క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న వారితో పాటు గతంలో ఎన్నికల కేసులున్న పాత నేరస్థులు, సస్పెక్ట్‌షీటర్లు 16మందిని శనివారం బైండోవర్‌చేశామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. 4 కేసుల్లో 16మందిని స్థానిక తహసీల్దార్ ఎదుట హాజరు పరిచినట్లు, లక్షరూపాయల చొప్పున సొంత పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన అడిషనల్ డీసీపీ

జమ్మికుంట రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంభునపల్లి శివారులో శుక్రవారం గుర్తుతెలియని మృతదేహం లభించిన సంఘటనస్థలాన్ని అడిషనల్‌డీసీపీ వెంకటరమణ శనివారం పరిశీలించారు. 30-35సంవత్సరాల వయస్సు యువకుడిని హత్యచేసి గోనె సంచులు, చద్దర్లలోచుట్టి రోడ్డుపక్కన పత్తిచేనులో పడేశారు. యువకుడిని గుర్తించేందుకు అతడు ధరించిన దుస్తులు, చెవిపోగు, చేతికి కంకణాలు ఇతర ఆనవాళ్లను రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు పంపించినట్లు తెలిసింది. హత్య ఘటన వెలుగు చూడకముందు ఆ రోడ్డులో పెళ్లి భారత్‌లు జరిగాయని, పరిమల సొసైటీ రోడ్డులో నిత్యం అర్ధరాత్రివరకు ఆకతాయిలు మద్యం తాగుతారని స్థానికులు తెలిపారు. డీసీపీవెంట హుజూరాబాద్ ఏసీపీమాధవి,సీఐ రామకృష్ణగౌడ్ ఉన్నారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వ్యవసాయ బావి మోటారు వైర్ చోరీ

వీణవంక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్ వంగల కొండాల్‌రెడ్డికి చెందిన వ్యవసాయ బావి వద్ద స్టాటర్‌తోపాటు మోటర్‌వైరును శనివారం దొంగలు ఎత్తుకెళ్లారు. తరచూ మోటార్ల కాపర్‌వైర్ ఎత్తుకెళ్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కోరుట్లలో రెండిళ్లలో చోరీ

కోరుట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని రవీంద్ర రోడ్డులో శుక్రవారం రాత్రి తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో చోరీ జరిగింది. సీసీ ఫుటేజీలకు ఉన్న వైర్లను తొలగించి దొంగలు ఇండ్లలో చొరబడి దొంగతనం చేశారు. రవీంద్ర రోడ్డులో నివాసం ఉంటున్న కటకం రాజారాం దంపతులు గురువారం ఇంటికి తాళంవేసి బంధువుల ఇంటికి వెళ్లి శనివారం ఉదయం తిరిగిరాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రెండున్నర తులాల బంగారు అభరణాలు రూ. 25అపహరణకు గురయినట్లు బాధితుడు తెలిపాడు. అదేకాలనీకిచెందిన ఇలుటపు భూమయ్య తన చిన్న కుమారుడి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద కుమారుడి ఇంటి వద్ద నిద్ర పోయాడు. ఇంటి ముందర ఉన్న సీసీకెమెరా వైర్లను కట్‌చేసి దుండగులు ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. భూమయ్య ఉదయం చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉన్న విషయం కుటుంబసభ్యులతో పాటు పోలీసులకు సమచారం అందించారు. ఇంట్లోని బీరువాలోఉన్న రెండుతులాల బంగారు అభరణాలు, మూడుతులాల వెండిఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. బాధితులు ఇచ్చిన పిర్యాదు మేరకు ఎస్ఐ చిరంజీవి కేసునమోదు చేసి క్లూజ్‌టీంతో తనిఖీలు నిర్వహించారు. కాగా కత్తులతో ముగ్గురుదొంగలు ఆ ప్రాతంలో సంచారం చేస్తునట్లు పోలీసులు సీసీఫుటేజ్ ద్వారా గుర్తించారు.



దొంగలు ధ్వంసం చేసిన బీరువా

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మల్లాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతారం గ్రామ శివారులో పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శనివారం పట్టుకున్నారు. శనివారం చిట్టాపూర్ గ్రామశివారులో చేపట్టిన తనిఖీల్లో అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.



చిట్టాపూర్ శివారులో పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లు

మద్యం పట్టివేత

ఇల్లందకుంట, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని సీతంపేటకు చెందిన బోయిని అశోక్ వద్ద నిల్వ ఉన్న రూ.27వేల విలువైన మద్యాన్ని శనివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. సీతంపేటలో తనిఖీలు నిర్వహిస్తుండగా, గ్రామానికి చెందిన అశోక్ మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందింది. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు, అతడిపై కేసునమోదు చేసినట్లు ఎస్సైక్రాంతికుమార్ తెలిపారు.

కథల పోటీలో 'మూఢనమ్మకాలు'కు చోటు



విద్యార్థినిని అభినందిస్తున్న ఎంఈవో ప్రభాకర్

ధర్మారం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో నిర్వహించిన కథల పోటీలో నర్సింహులపల్లి విద్యార్థి రాసిన "మూఢ నమ్మకాలు" కథకు చోటు దక్కింది. బాలల దినోత్సవం సందర్భంగా చిల్డ్రన్స్ ఎడ్యు కేషనల్ అకాడమీతోపాటు బాలచెలిమి పిల్లల మాసపత్రిక జాతీయ స్థాయి కథల పోటీలు నిర్వహించారు. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 714మంది తాము రాసిన కథలను పోస్ట్‌ద్వారా పంపగా, 16ఉత్తమ కథలను ఎంపికచేశారు. ఎంపికైన 16ఉత్తమ కథల్లో మండలంలోని నర్సింహులపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న గంగారపు శృతి రాసిన మూఢనమ్మకాలు కథకు చోటుదక్కింది. ఎంపికైన 16మంది విద్యార్థులకు డిసెంబర్ 22న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో నగదు బహుమతితోపాటు షీల్డ్, ప్రశంసాపత్రం అందజేయనున్నారు. ఉత్తమ కథలను పుస్తకరూపంలో తీసుకురానున్నట్లు నిర్వాహకులు మణికొండ వేదకుమార్, గరిపెల్లి అశోక్ తెలిపారు. పిల్లలు రచనలు చేసేలా కృషిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయులు కందుకూరి భాస్కర్‌ను ఎంఈవో పి ప్రభాకర్ అభినందించారు. విద్యార్థి శృతిని ఉపాధ్యాయులు రమేష్, నరేందర్, ఆంజనేయులు, పుష్పలత, శ్రీనివాస చక్రవర్తి, రామ చంద్రారెడ్డి, సతీష్ కుమార్, సీఆర్పీ శ్రీలత అభినందించారు.

ఆర్చరీలో చికితకు గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్‌తో చికిత

ఎలిగేడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన తానిపర్తి చికిత ఖేలో ఇండియా ఆర్చరీలో గోల్డ్ మెడల్ సాధించింది. రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో ఖేలో ఇండియాలో భాగంగా యూనివర్సిటీ స్థాయిగేమ్స్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన ఆర్చరీ పోటీల్లో ఆమె బంగారం పతకం సాధించి, రాష్ట్రానికి, జిల్లాకు పేరు తీసుకు వచ్చింది. ఈ మేరకు ఎమ్మెల్యే విజయరమణరావు బంగారం పతకం సాధించిన చికితను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, మాజీసర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, ఎలిగేడు మాజీ ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావుతోపాటు పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తూ చికితను అభినందనలతో ముంచెత్తారు.

ఇండియన్ నేవీ సబ్ లెఫ్టినెంట్‌గా గంభీరావుపేట యువకుడు



నిహాంత్‌గౌడ్

గంభీరావుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన నిహాంత్‌గౌడ్ అనే యువకుడు ఇండియన్ నేవీ సబ్‌లెఫ్టినెంట్‌గా ఎంపికయ్యాడు. విశాఖపట్నంలో శనివారం నిహాంత్‌గౌడ్ విధుల్లో చేరారు. నిహాంత్‌గౌడ్ 6వతరగతి నుంచి ఇంటర్‌వరకు కోరుకొండ సైనిక్‌స్కూల్‌లో విద్యనభ్యసించాడు. ఇంటర్ పూర్తిచేశాక పూణేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ మూడేళ్లపాటు శిక్షణ పొందాడు. తరువాత ఇండియన్ నేవల్ అకాడమీలో ఏడాదిపాటు శిక్షణ తీసుకున్నాడు. తాజాగా ఇండియన్ నేవీ సబ్‌లెఫ్టినెంట్‌గా ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా నిహాంత్‌ను తల్లి దండ్రులు, బంధువులు అభినందించారు. గంభీరావుపేటలో తన స్నేహితులు ఆనందం వ్యక్తం చేశారు.

హుజూరాబాద్ ఏసీపీ కార్యాలయం తనిఖీ

హుజూరాబాద్, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని అడిషనల్ డీసీపీ వెంకటరమణ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. చల్లూర్ వంటి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇటీవల జమ్మికుంట ప్రాంతంలో జరిగిన హత్య కేసు దర్యాప్తు పురోగతిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏసీపీ మాధవి, సీఐ కరుణాకర్ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ వెంకటరమణ

లెక్క దాటొద్దు..

- ప్రతి పైసా లెక్క చెప్పాల్సిందే
- ప్రచారంపై నిరంతరం నిఘా కన్ను
- మండలాల వారీగా వ్యయపరిశీలకుల నియామకం
- ఎంసీసీ అమలుకు పకడ్బందీగా చర్యలు



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పంచాయతీ ఎన్నికల పోరుకు తెరలేచింది. తొలి విడత నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఆదివారం రెండోవిడత మొదలైంది. నామినేషన్లు దాఖలు నుంచి అభ్యర్థులు ఖర్చులకు వెనుకాడకుండా గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తుంటారు. ఎన్నికల్లో అభ్యర్థులు ఖర్చుపెట్టే ప్రతి పైసా లెక్క చెప్పాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం మాత్రం ఖర్చు పరిమితిపై నిఘా పెట్టింది. ఎన్నికల ప్రచార ఖర్చుకు పరిమితి, నిబంధనలను రూపొందించింది. పరిమితికి మించి ఖర్చు చేసే అభ్యర్థులపై వేటు తప్పదు. ఇందు కోసం అభ్యర్థుల ఖర్చుల పరిశీలనకు మండలాల వారీగా వ్యయపరిశీలకులను నియమించారు. ఎన్నికలను పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నాయి. దీంతో ధన, పలుకుబడి ఉన్న అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. వీరితో పాటు పార్టీలకు సంబంధం లేని వారు కూడా అనేకమంది బరిలోకి రావడానికి సిద్ధమవుతున్నారు. పోటీ చేసే అభ్యర్థులు మాత్రం ఎన్నికల సంఘం విధించిన ఖర్చు పరిమితికి లోబడే ఉండాలి.

చికెన్ బిర్యానీ రూ 100. మటన్ రూ. 120

లస్సీ, సాఫ్ట్ డ్రింక్ ఒకటి రూ 10, వాటర్ ప్యాకెట్ ఒక రూపాయి, వాటర్ బాటిల్ రూ 20, వాటర్ క్యాన్ 20లీటర్లు రూ10, టీ రూ 5, కాఫీ రూ 10, బ్రేక్ ఫాస్ట్ రూ 35, వెజిటేబుల్ ప్లేట్ భోజనం రూ.50, నాన్ వెజిటేబుల్ ప్లేట్ రూ. 100, చికెన్ బిర్యానీ రూ. 100, మటన్ బిర్యానీ రూ. 120, పెద్ద సమోసా ఒక టి రూ 6, చిన్న సమోసా రూ 2, ప్లేట్ మిర్చి, బజ్జీ, పకోడి రూ. 20, లెమన్ బియ్యం ప్లేట్ రూ.40 ధరలను నిర్ణయించారు. పంచాయతీ ఎన్నికల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, ప్రచా రానికి అభ్యర్థుల ఖర్చులపై కట్టుదిట్టమైన నిఘా ఏర్పాట్లు చేశారు.

సర్పంచ్‌కు రూ. 1.5లక్షల నుంచి రూ 2.5 లక్షలు

ఐదు వేల జనాభాలోపు గ్రామాల్లో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థి రూ1.50 లక్షలు, వార్డు సభ్యుడు రూ 30 వేలు, 5 లక్షలపైగా ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థి రూ 2.50 లక్షలు, వార్డు సభ్యుడు రూ 50 వేలు ఖర్చు పరిమితి ఉంది. ఎన్నికల సామగ్రికి లెక్క ఉంది ప్రచారానికి ఉపయోగించే సామాగ్రికి లెక్క ఉంది. 76 రకాల సామగ్రికి రేట్లు ఎన్నికల సంఘం నిర్ణయించింది. రోజుకు లౌడ్ స్పీకర్ అద్దె 100 వాట్స్ రూ.500, 200 వాట్స్‌కు రూ 1300, డీజేకు రూ.2 వేలు, ఎల్ఈడీ స్క్రీన్‌కు సైజ్‌ను బట్టి ఒకరోజు కిరాయి రూ.5 వేల నుంచి 12 వేలు, వాహనంపై ఎల్ఈడీ అమర్చితే రూ.8 వేలు నుంచి 20 వేల వరకు చార్జీలు నిర్ణయించారు. వీడియోగ్రాఫర్ కెమెరాతో కలిపి నెలకు రూ 22,050, డ్రోన్ కెమెరాకు ఒక రోజు రూ3,500, ఆడియో క్యాసెట్ రికార్డు రూ 2,500, ఆటోతో రూ 3 వేలు, నలుగురైదుగురు కూర్చునే వేదిక రోజుకు రూ 150 నుంచి రూ 2800 వరకు ఉంది. క్లాత్ బ్యానర్లు ఫీట్లలో సైజ్‌ను బట్టి రూ. 9 నుంచి రూ 13 వరకు, ఫ్లెక్సీ బ్యానర్లు స్క్వైర్‌ఫీట్ రూ. 7 , హోర్డింగ్ ఫ్లెక్సీ రూ5 వేల నుంచి రూ 6వేల వరకు ధర నిర్ణయించారు.

ఒక బ్యాడ్జీ రేటు రూ 10, పోస్టర్లలో మల్టీకలర్ సంఖ్యను బట్టి రూ 8,500 నుంచి 75 వేలు , పూల దండ చిన్నది రూ 50, కలర్ పేపర్లతో రూ 150,పూలతో రూ 400 ,కరపత్రాలు ఇకటి రూపాయి,శాలువ రూ 50, ప్లకార్డులు రూ 25, జెండాలు రూ 5 నుంచి రూ 18 వరకు, డ్రైవర్‌తో కలిపి కారు, జీపు,టెంపో, ట్రక్, వాహనాల అద్దె రూ 2500, ఇన్నోవా,సూమో రూ. 3500, కారు రూ 2 వేలు, మూడు చక్రాల వాహనం రూ850, డిసిఎం వ్యాన్ రూ 3వేలు, మినీ బస్ 25 సీట్ల పరిమితి రూ4500, టాటా ఎసీ వాహనం రోజుకు రూ 1600, బోలెరో రూ 3000, డీలక్స్ రూ 2,200, సాధారణ గది రూ 1,200, ఏసీ ఫంక్షన్ హాల్ కుర్చీలతో అర్బన్‌లో రూ 15 వేలు, రూరల్‌లో ఏసీ ఫంక్షన్ హాల్ రూ 10 వేలు, అర్బన్‌లో ఏసీ లేని ఫంక్షన్ హాల్ రూ8 వేలు, రూరల్‌లో ఏసీ లేని ఫంక్షన్ హాల్ రూ 10 వేలు, టెంట్ బట్టి రూ800, సైడ్‌వాల్స్ రూ 30,కార్పెట్లు రెడ్ రూ 350,పెద్ద సైజ్ గ్రీన్ రూ 600 నిర్ణయించారు.

కార్పొరేట్ కళాశాలల మోసం

గణేశ్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ ఇంటర్మీడియెట్ కళాశాలలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని జాతీయ బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ ఆరోపించారు. శనివారం తెలంగాణ ఇంటర్మీడియెట్ బోర్డుకార్యదర్శి శ్రీకృష్ణ ఆదిత్యకు ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ ముందస్తు అడ్మిషన్ల పేరిట దోపిడీ చేస్తున్నాయని, స్క్రీనింగ్‌టెస్టులు నిర్వహిస్తున్నాయని మండిపడ్డారు. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ తల్లి దండ్రులపై ఆర్థికభారం మోపుతున్నాయన్నారు. ఒకే పేరుతో అనుమతి తీసుకొని దానికి అదనంగాబ్రాంచ్‌లు నడుపుతున్నాయ న్నారు. నిబంధనలు పాటించని కళాశాలల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం స్వల్పంగా నీరు వస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 1,338క్యూసెక్కుల వరదవచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి సరస్వతీ కాలువ ద్వారా 650 క్యూసెక్కులు, తాగు నీటి అవసరాల కోసం మిషన్ భగీరథ ద్వారా 231క్యూసెక్కులు, ఆవిరిరూపంలో 457 క్యూసెక్కుల నీరుపోతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 80.501 టీఎంసీలు కాగా అంతేస్థాయి నీటిమట్టంతో ప్రాజెక్టు నిండు కుండలా ఉంది. ప్రాజెక్టులోకి ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు 948.168 టీఎంసీల నీరు వచ్చిచేరగా, ప్రాజెక్టు నుంచి 880.455 టీఎంసీలనీరునుదిగువకు వదిలారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీరు

పోరాటాల ద్వారానే హక్కుల సాధన

- సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి

వేములవాడ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికుల పోరాటాల ద్వారానే హక్కులు సాధిస్తామని సీపీఐ జాతీయనాయకుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం వేములవాడ పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల మహాలింగేశ్వర ఫంక్షన్ హాల్‌లో రెండు రోజుల పాటు జరిగే ఏఐటి యూసీ అనుబంధమైన ఆల్ ఇండియా బీడీ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను ఏఐటీ యూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంటి బాలరాజు జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశంలోని 14రాష్ట్రాలలో బీడీపరిశ్రమల్లో 75లక్షలమంది బీడీ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. బీడీ కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. 1965లో ఏఐటియూసి అనుబంధంగా బీడీవర్కర్స్ ఫెడరేషన్ కమిటీ ఏర్పాటైందన్నారు. అప్పటినుంచి అనేక ఐక్యఉద్యమాలు చేపడుతూ బీడీ కార్మికు లకు కనీస కూలీపెంపు, ప్రావిడెంట్ ఫండ్, బోనస్, సెలవు, పనిదినాలు, తదితర హక్కులు కాపాడుకోవటం కోసం పోరాటం చేశారన్నారు.

బీడీ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్న సందర్భంగా డిసెంబర్ 2వ వారంలో నిర్వహించే సేవ్ ఇండియా- సేవ్ బీడీ వర్కర్స్ నినాదంతో చలోఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి గోవర్ధన్ మాట్లాడుతూ బీడీకార్మికులకు దేశవ్యాప్తంగా ఒకే వేతనం అమలుచేయాలన్నారు. ప్రతి వెయ్యి బీడీలకు రూ.300 ఇవ్వాలని, బీడీ పరిశ్రమలో కాంట్రాక్టు పద్ధతిని రద్దు చేయాలన్నారు. జాతీయ కౌన్సిల్ సమావేశంలో బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఇంచార్జి ఎస్. విలాస్, ఆల్ ఇండియా సిగార్, టాబాకో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్. కాశీవిశ్వనాథం, జాతీయ అధ్యక్షుడు కార్పర్ ఉగ్లే, జాతీయ ఉపాధ్యక్షులు నవాబ్, రాష్ట్ర బీడీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు, సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సుదర్శన్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, బీడీ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కొక్కుల శాంత, అధ్యక్షులు కె. అనసూర్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు, నాయకులు దేవదాసు, లక్ష్మన్, పోచమల్లు, శాంత, రాధ, తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి, కొండగట్టుకు భక్తుల తాకిడి



ధర్మపురిలో అభిషేకాది పూజల్లో పాల్గొన్న భక్తులు



కొండగట్టు అంజన్న ఆలయ క్యూలైన్‌లో భక్తులు

ధర్మపురి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. భక్తులు కుంకుమార్చన, నరసింహహోమం, స్వామివారల నిత్య కల్యాణం జరిపించారు. యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనెపోసి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నాగదేవతకు, రావిచెట్టు, ఆంజనేయస్వామి వారికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. స్వామివారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ పూజలు నిర్వహించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, భక్తులకు సేవలు అందించారు.

అంజన్న సన్నిధిలో..

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిదానం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బేతాళుడు, శ్రీరాములవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

హాల్ టికెట్ల కోసం విద్యార్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

తిమ్మాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా విద్యార్థులకు ఫీజు చెల్లించాలని యాజమాన్యం హాల్‌టికెట్లను నిలిపివేసిందని శనివారం ఎస్ఎఫ్ఐ నాయకులు, కొందరు విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి కళాశాల ఆవరణలో ఆందోళన చేపట్టారు. దీంతో యాజమాన్యం విద్యార్థులకు హాల్ టికెట్లు ఇచ్చి పరీక్ష రాసేందుకు అనుమతి ఇవ్వడంతో వివాదం సద్దు మణిగింది. అంతకు ముందు తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలకు కౌన్సెలింగ్‌లో ఫ్రీసీటు వచ్చిందనిచెప్పడంతో చేర్పించామన్నారు. ఇప్పు డేమో ఫీజులు చెల్లించమంటున్నారని వాపోయారు.

అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ తిమ్మాపూర్‌లోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా చదువుతున్న విద్యార్థులను ఫీజులు కట్టాలని వేధిస్తు న్నారని ఆరోపించారు. ఈ విషయంపై వాగేశ్వరి కళాశాల యాజమాన్యాన్ని వివరణ కోరగా 2024సెప్టెంబరులో విద్యార్థులు 30వేల ఫీజు చెల్లించాలని జీవో విడుదలైందని, దానిపై పూర్తి క్లారిటీ ఇవ్వలేదని తెలిపింది. ఈ ఏడాది బీసీ, ఓసీలు రూ.15వేలు ఫీజు చెల్లించే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొంది.దీంతో కళాశాల ఫీజు రూ.15వేలు, యూనివర్సిటీ ఫీజు రూ.2100 మొత్తం రూ.17100 చెల్లించాలని 20రోజుల క్రితమే విద్యార్థులకు సమాచారమిచ్చామన్నారు. పరీక్షలు రాయకుండా విద్యార్థులను ఇబ్బంది పెట్టేందుకు హాల్ టికెట్‌లను నిలిపివేయలేదని, ఇంకా సమయం ఉందని ఆలోపు హాల్ టికెట్‌లను ఇచ్చే వారిమని తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు అనంపల్లి వినయ్‌సాగర్, జిల్లాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన ఉమ్మడిజిల్లా వాలీబాల్ శిక్షణ శిబిరం



శిక్షణ శిబిరంలో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలబాలికల శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈనెల 24న జిల్లాకేంద్రంలోని మినీస్టేడియంలో అసోసి యేషన్ బాలబాలికల జట్లకు ప్రత్యేకంగా శిక్షణ శిబిరాన్ని ఏర్పాటుచేసింది. శిక్షణ శిబిరానికి ఉమ్మడి కరీంనగర్‌జిల్లా నుంచి బాలురజట్టులో 16మంది, బాలికలజట్టులో 16మంది క్రీడాకారులను ఎంపికచేశారు. వీరికివసతి కల్పించి ఉదయం, సాయంత్రం వాలీబాల్ కోచ్‌లు సంపత్‌కుమార్, జగన్ పర్యవేక్షణలో శిక్షణ ఇప్పించారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు..

జిల్లాకేంద్రం మినీస్టేడియంలో ఆదివారం నుంచి జరుగనున్న 8వతెలంగాణ రాష్ట్రస్థాయి జూని యర్స్ వాలీబాల్ పోటీలకు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. నాలుగు వాలీబాల్ కోర్టులను సిద్ధం చేశారు. రాత్రిసమయంలో వాలీబాల్ పోటీలకు ఆటకం లేకుండా లేకుండా ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో 10బాలురు జట్లు, 10బాలికలజట్లు పాల్గొంటున్నాయి. పోటీలలో పాల్గొంటున్న బాలబాలికలు 240,దాదాపు 50మంది అఫీషియల్స్‌కు స్టేడియం సమీపంలో వసతి సౌకర్యం కల్పించారు.

ఆల్ ఇండియా పోలీస్ మీట్‌కు వినీత్



వినీత్

హుజూరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన హాకీ క్రీడాకారుడు మోటపోతుల వినీత్ ఆల్ ఇండియా హాకీ పోలీస్ మీట్‌కు ఎంపికయ్యాడు. డిసెంబరు 4నుంచి 15వరకు గుజరాత్ రాజకోట్‌లో మీట్ నిర్వహించనున్నారు. వినీత్ హైదరాబాద్‌లో స్పెషల్ అర్మడ్ రిజర్వు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ సందర్భంగా హుజూరాబాద్ హాకీ క్లబ్ అధ్యక్షుడు తోట రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, బొడిగె తిరుపతి, శంకర్, శ్యామ్, సజ్జు, సాయికృష్ణ, విక్రమ్, సాంబరాజు, వంశీ, వినయ్, పరబ్రహ్మం హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పెద్దపల్లి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్స్ ఖోఖోపోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు మండలంలోని నిట్టూరు పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో ఈనెల 28నుంచి 30తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాఠశాలలో చదు వుతున్న టీనా, బాలసాని సిర, భూషనవేణి వినయ్, సాగలసంజయ్‌లు పాల్గొంటున్నట్లు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

గంగాధర : గంగాధర మోడల్‌స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ నాగరాజు తెలిపారు. పాఠశాలకు చెందిన అక్షయ, అర్చన, సాన్విత ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రిన్సిపాల్ పద్మ, పీఈటీ నాగరాజు అభినందించారు.



ఎంపికైన నిట్టూరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పద్మ

అధ్యాపకులు ఉత్తమ సేవలు అందించాలి

కొడిమ్యాల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : కళాశాలలో విధులు నిర్వహించు అధ్యాపకులు ఉత్తమ సేవలు అందించి నట్లయితే గుర్తింపు పొందుతారని ప్రిన్సిపాల్ కె. వేణు అన్నారు. కళాశాల స్టూడెంట్స్ కౌన్సిలర్ డాక్టర్ పి. తిరుపతి విద్యార్థులకు సహ పాఠ్య కార్యక్రమాల నిర్వహణలో ఉత్తమ సేవలు అందించి నందుకు కొడిమ్యాల రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. సహ పాఠ్య కార్యక్రమాల నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన స్టూడెంట్ కౌన్సిలర్ డాక్టర్ తిరుపతిని ప్రిన్సిపాల్, పలువురు అధ్యాపకులు శాలువా కప్పి, బొకెను అందించి సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జయపాల్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, జయశీల, అనిల్‌కుమార్, భాస్కర్, శ్యాంకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో దీక్షా దివస్

ధర్మపురి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దీక్షా దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, ఆనాటి దీక్షా ఫలితంగా డిసెంబర్ 9 ప్రకటన గురించి చర్చించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు, కేసీఆర్ పోరాటం గురించి కార్యకర్తలు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కార్యనిర్వాహక కార్యదర్శి బిసగోని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు జువ్వాడి అశోక్‌రావు, బొమ్మకంటి గంగారం, యూత్ అధ్యక్షులు బొజ్జ మహేష్, ప్రేమ్‌సాగర్, శంకరయ్య, రాజేందర్, రాజయ్య, కిషన్, రవి, నర్సయ్య, నారాయణ, గంగన్న, లింగన్న, ధర్మయ్య, బుచ్చన్న, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

ఇబ్రహీంపట్నం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళాభివృద్ధి, స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని గోదూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాలు, సైబర్ క్రైం, ఆన్‌లైన్ మోసాలు తదితర అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. తదనంతరం బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల సఖి కేంద్రం నుండి శారద మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టం ప్రకారం 18 ఏళ్ల లోపు అమ్మాయికి 21 ఏళ్ల లోపు అబ్బాయికి వివాహం చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యాక్రమంలో ఉపాధ్యాయుడు రాజయ్య, ఏఎన్ఎం పద్మ, అంగన్‌వాడీ టీచర్లు భాగ్యవతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోడల్ స్కూల్‌లో శనివారం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న బేటీ బచావో బేటీ పడావో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారి, కౌన్సిలర్ జాన్సన్ బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఇందులో ఇంటర్మీడియట్, హైస్కూల్ విద్యార్థులకు చిన్నతనంలో వివాహాల వల్ల కలిగే అనర్థాలు, భవిష్యత్‌లో ఎదురయ్యే సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రిన్సిపాల్ స్వర్ణలత, మహేష్, నరేష్, ఉజ్వల, శ్రీనివాస్, రాజేందర్, రాము పాల్గొన్నారు.



వడ్డీ రాయితీ వచ్చేదెప్పుడో..?

క్రమం తప్పకుండా చెల్లించినా..

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రభుత్వాలు బ్యాంకు లింకేజీ ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్నాయి. ఇందులో భాగంగానే రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం వడ్డీలేని రుణాలు విడుదల చేసింది. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని క్రమం తప్పకుడా చెల్లించే మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పథకం వర్తిస్తుందని అధికారులు ప్రకటించారు. అర్హులైన మహిళా సంఘాలను గుర్తించి మెప్మా అధికారులు ప్రభుత్వానికి వడ్డీ రాయితీ కోసం నివేదికలు పం పారు. అయినప్పటికీ పట్టణ ప్రాంతాల మహిళా సంఘాలకు వడ్డీ రాయితీ రాకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. తాజాగా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు వర్తించిన ఈ పథకం తమకు ఎప్పుడు వర్తింపజేస్తారని పట్టణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల సభ్యులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

- పట్టణ మహిళా సంఘాల్లో నిరాశ
- ఇటీవల గ్రామీణ సంఘాలకు రూ.10.69 కోట్లు వడ్డీ మాఫీ
- అర్బన్ ప్రాంతాల్లో రూ.3.10 కోట్లు పెండింగ్

జగిత్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లోని మహిళా సంఘాలు తీసుకున్న రుణాలకు ప్రభుత్వం వడ్డీ రాయితీని మంజూరు చేయకపోవడంతో వారు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఇటీవల గ్రామీణ మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రభుత్వం వడ్డీ రాయితీని మంజూరు చేసింది. మహిళలు తీసుకున్న రుణాలకు ప్రతీనెల అసలుతో పాటు వడ్డీ చెల్లిస్తుండగా వారికి వడ్డీ భారం పడవద్దని తిరిగి ప్రభుత్వం వడ్డీ వాపస్ ఇస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల సభ్యులకు జిల్లా వ్యాప్తంగా ఇటీవల రూ.10.69 కోట్ల వడ్డీ వాపస్ ఇచ్చారు. అర్బన్ ప్రాంతాల్లో సైతం వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి.

మున్సిపాలిటీల్లో 3,493 సంఘాలు..

జిల్లాలో 3,493 సంఘాలకు రూ.3.10 కోట్ల వడ్డీ రాయితీ అందాల్సి ఉంది. ఇందులో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 1,607 సంఘాలకు రూ. 88,36,983 వడ్డీ రాయితీ, 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ 1,886 సంఘాలకుగాను రూ.2,22,49,083 వడ్డీ రాయితీ అందాల్సి ఉంది. కాగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీల పరిధిలో 1,607 స్వయం సహాయక మహిళా సంఘాలకు గాను రూ.88,36,983 వడ్డీ రాయితీ సొమ్ము అందాల్సి ఉంది. ఇందులో జగిత్యాల మున్సిపల్‌లో 682 సంఘాలకు రూ.36,23,316, కోరుట్ల 511 సంఘాలకు రూ. 30,01, 536, మెట్‌పల్లి 265 సంఘాలకు రూ.13,42, 659, ధర్మపురి మున్సిపల్‌లో 113 సంఘాలకు రూ.6,36,682 వడ్డీ రాయితీ డబ్బులు రావాల్సి ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీల పరిధిలో 1,886 స్వయం సహాయక మహిళా సంఘాలకు గాను రూ.2,22,49,083 వడ్డీ రాయితీ సొమ్ము అందాల్సి ఉంది. ఇందులో జగిత్యాల మున్సిపల్‌లో 844 సంఘాలకు రూ.89,02,494, కోరుట్ల 583 సంఘాలకు రూ.72,46,230, మెట్‌పల్లి 303 సంఘాలకు రూ.41,96, 031, రాయికల్‌లో 33 సంఘాలకు రూ.3,44,041 ధర్మపురి మున్సిపల్‌లో 123 సంఘాలకు రూ.15,60,287 వడ్డీ రాయితీ డబ్బులు రావాల్సి ఉంది. వీటి కోసం మహిళా సంఘాల సభ్యులు ఎదురు చూస్తున్నారు.

ఉన్నతాధికారులకు వివరాలు అందించాం

దుర్గపు శ్రీనివాస్‌గౌడ్, మెప్మా ఏవో



జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీల్లోని స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు రావాల్సిన వడ్డీ రాయితీ డబ్బుల వివరాలను ఉన్నతా ధికారులకు అందించాం. సంబంధిత డబ్బులను ప్రభుత్వం విడుదల చేయగానే మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేస్తాం.

గ్రామాల్లో 11,825 సంఘాలకు విడుదల..

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 11,825 మహిళా సంఘాలకు ఇటీవల ప్రభుత్వం రూ. 10.69 కోట్ల వడ్డీ రాయితీ డబ్బులను విడుదల చేసింది. 2024 సెప్టెంబరు నుంచి 2025 జనవరి వరకు తీసుకున్న రుణాలకు సంబంధించిన వడ్డీని ప్రభుత్వం వాపస్ చేసింది. ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గానికి 2.78 కోట్లు విడుదల చేయగా, జగిత్యాల నియోజకవర్గానికి 2.12 కోట్లు, కోరుట్ల నియోజకవర్గానికి రూ. 2.58 కోట్లు, చొప్పదండి నియోజకవర్గానికి రూ. 1.61 కోట్లు, వేములవాడ నియోజకవర్గానికి రూ. 1.59 కోట్లు విడుదల చేసింది.

చివరి రోజు భారీగా నామినేషన్లు దాఖలు

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ చివరి రోజు అయినందున రాత్రి 11 గంటల వరకు కొనసాగింది. శనివారం రాత్రి 11 వరకు అందిన సమాచారం మేరకు మండలంలోని 23 గ్రామాల్లో సర్పంచు బరి కోసం 159 మంది, వార్డు మెంబర్లకు నామినేషన్లు 397 మంది అభ్యర్థులు దాఖలు చేశారు. 30న నామినేషన్లను పరిశీలించి చెల్లుబాటు అయ్యే అభ్యర్థుల జాబితాను అధికారులు వెల్లడిస్తారు. అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

●**కోరుట్ల రూరల్:** గ్రామ పంచాయితీ సర్పంచ్ వార్డు సభ్యుల ఎన్నికల కొరకు స్వీకరిస్తున్న నామినేషన్ శనివారం రాత్రి వరకు కొనసాగింది. మండలంలోని 15 గ్రామ పంచాయితి సర్పంచ్ 152 వార్డు సభ్యుల నామినేషన్ల దాఖలు కొరకు 5 క్లస్టర్లలను ఏర్పాటు చేసి ఎన్నికల అధికారులు నామినేషన్లను స్వీకరించారు. గ్రామ సర్పంచ్ కొరకు 108 వార్డు సభ్యుల కొరకు 372 నామినేషన్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

అయిలాపూర్ గ్రామ సర్పంచ్ కొరకు 15, వార్డు సభ్యుల కొరకు 46, చిన్నమెట్‌పల్లి సర్పంచ్ కొరకు 9 వార్డు సభ్యుల కొరకు 23, దర్మారం గ్రామ సర్పంచ్ కొరకు 06 వార్డు సభ్యుల కొరకు 12, గుమ్లాపూర్ సర్పంచ్ కొరకు 05 వార్డు సభ్యుల కొరకు 16, జోగినిపల్లి సర్పంచ్ కోరకు 08 వార్డు సభ్యుల కొరకు 18, కల్లూర్ సర్పంచ్ కొరకు 05 వార్డు సభ్యుల కొరకు 17, మాదాపూర్ సర్పంచ్ కొరకు 07, వార్డు సభ్యుల కొరకు37, మోహన్‌రావుపేట 06 వార్డు సభ్యుల కొరకు 28, నాగులపేట సర్పంచ్ కొరకు 09 వార్డు సభ్యుల కొరకు25, పైడిమడుగు సర్పంచ్ కొరకు 12 వార్డు సభ్యుల కొరకు 46, సంగెం సర్పంచ్ కొరకు 07 వార్డు సభ్యుల కొరకు 24, సర్పరాజుపూర్ సర్పంచ్ కొరకు 04 వార్డు సభ్యుల కొరకు 16, తిమ్మయ్యపల్లి గ్రామ సర్పంచ్ కొరకు 04 వార్డు సభ్యుల కొరకు 12, వెంకటాపూర్ సర్పంచ్ కొరకు 04 వార్డు సభ్యుల కొరకు 24, యూసుఫ్‌నగర్ సర్పంచ్ కొరకు 07 వార్డు సభ్యుల కొరకు 28 నామినేషన్ల్ దాఖలు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

●**భీమారం:** స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా భీమారం మండలంలో నిర్వహించిన సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఇందులో భాగంగా నామినేషన్ పత్రాల పరిశీలన శనివారం రాత్రి 10.30 గంటల వరకు కొనసాగింది.

మండలంలోని 13 గ్రామాల్లో సర్పంచ్ స్థానాలకు అభ్యర్థులు భారీగా నామినేషన్లు వేశారు. దీంతో వారి మధ్య భారీగా పోటీ నెలకొంది. భీమారం గ్రామంలో అత్యధికంగా 11 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా, రంగాపూర్‌లో అత్యల్పంగా ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు.

దేశాయిపేటలో ఏడుగురు, గోవిందారంలో ఐదుగురు, కమ్మరిపేటలో 8 మంది, లింగంపేటలో ఆరుగురు, మన్నెగూడెంలో 9 మంది నామినేషన్లు వేశారు. మోత్కురావుపేటలో ఐదుగురు, పసునూరులో ఆరుగురు, రాజలింగంపేటలో 8 మంది, రాగోజీపేటలో ఐదుగురు, వెంకట్రావుపేటలో ఏడుగురు, ఒడ్యాడ్‌లో ఏడుగురు సర్పంచ్ పదవికి పోటీ పడనున్నారు.

27 వార్డు స్థానాలు ఏకగ్రీవం

మండలంలోని 118 వార్డు స్థానాలకుగాను 27 వార్డు స్థానాలు ఏక్రగీవమయ్యాయి. భీమారం గ్రామంలోని ఒక వార్డు ఏక్రగీవం కాగా, దేశాయిపేటలో 8 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మన్నెగూడెంలో 5 వార్డు స్థానాలు, మోత్కురావుపేటలో ఒక వార్డు స్థానం, పసునూరులో ఒకటి, రంగాపూర్‌లో 7 స్థానాలు, ఒడ్యాడ్‌లో నాలుగు వార్డు స్థానాలు ఏక్రగీవమయ్యాయి.

మూలరాంపూర్ పంచాయతీ ఏకగ్రీవం

●ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలంలో మూడవ రోజు శనివారం నామినేషన్ల పర్వం కొనసాగింది. మండలంలోని 17 సర్పంచ్, 162 వార్డు మెంబర్లకు గాను ఐదు క్లస్టర్లలో సర్పంచ్‌లు, వార్డు మెంబర్ స్థానాలకు నామినేషన్లు దాఖలు అయినట్లు రిటర్నింగ్ అధికారులు తెలిపారు. ఇందులో తిమ్మాపూర్ క్లస్టర్, ఇబ్రహీంపట్నం, ఐకేపీ క్లస్టర్, వర్షకుండ క్లస్టర్, వేములకుర్తి పరిధిలో నామినేషన్లు కొనసాగుతున్న తెలిపారు.

ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్ గ్రామంలో సర్పంచ్ స్థానానికి ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలైంది. మూలరాంపూర్ పంచాయతీ జనరల్ మహిళకు రిజర్వ్ కాగా కాసుగంటి లాస్య అనే మహిళ సింగిల్ నామినేషన్ దాఖలు చేసింది. దీంతో ఆమె ఏకగ్రీవ ఎన్నిక లాంఛనమైంది. అధికారులు నామినేషన్ల పరిశీలన అనంతరం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

వేడెక్కిన రాజకీయం

(ఐదో పేజీ తరువాయి)

బాధ్యులు చేయాల్సిన పనులను అంచనా వేస్తున్నారు. ప్రచారానికి తక్కువ సమ యం ఉండడంతో గ్రామంలోని అన్ని వార్డులను కలుపుకొని ప్రచారం జరుపడానికి పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ఇదే స మయంలో ఇతర పార్టీల కార్యకర్తలు, నాయకులను బుజ్జగిస్తూ తమవైపు తిప్పుకోవడానికి చేపట్టాల్సిన చర్యలను అభ్యర్థులు పరిశీలిస్తున్నారు.

మలి విడతలో 144 పంచాయతీలు

ఈనెల 30వ తేదీ నుంచి మలి విడత నామినేషన్ల పర్వం మొదలుకానుంది. రెండో విడత నామినేషన్ల ను ఈనెల 30వ తేదీ నుంచి డిసెంబరు 2వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించనున్నారు. 3వ తేదీన నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటు అయిన నామినేషన్ల ప్రకటన, 4వ తేదీ వరకు అప్పీల్, 5వ తేదీన అప్పీల పరిష్కారం, 6వ తేదీ వరకు నామినేషన్ల ఉప సంహరణ, పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రకటన, డిసెంబరు 14వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభించి ఫలితాలను ప్రకటించనున్నారు.

గెలిపిస్తే గ్రామాభివృద్ధికి రూ.10 లక్షలు

-బాండ్ పేపర్ రాసిచ్చిన సర్పంచ్ అభ్యర్థి



బాండ్ పేపర్, చెక్కును గ్రామస్థులకు అందిస్తున్న అభ్యర్థి గులామ్ మహ్మద్

భీమారం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామ సర్పంచ్ అభ్యర్థి గులామ్ మహ్మద్ వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తున్నాడు. తనను గెలిపిస్తే వ్యక్తిగతంగా రూ.10 లక్షలు గ్రామాభివృద్ధికి ఖర్చు చేస్తానని బాండ్ పేపర్‌తో పాటు చెక్కుకు ప్రజల ముందు ఉంచాడు. తనను గెలిపిస్తే ఉప సర్పంచ్, ఇద్దరు వార్డు మెంబర్లు, ఇద్దరు పెద్ద మనుషులు, ఒక మహిళా సంఘం అధ్యక్షురాలు, ఒక ప్రధానోపాధ్యాయులతో కూడిన గ్రామాభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నాడు. గ్రామాభివృద్ధి కోసం బాండ్ పేపర్‌పై రూ.10 లక్షలు గ్రామాభివృద్ధికి కేటాయిస్తూ గ్రామ ప్రజలకు లిఖితపూర్వక హామీ ఇచ్చాడు. కమిటీ ద్వారా గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, స్ట్రీట్ లైట్లు, పాఠశాల అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపడతానని గులామ్ మహ్మద్ హామీ ఇచ్చాడు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

జగిత్యాలరూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ వరందన్, సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

కిక్‌బాక్సింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): అస్మిత కిక్‌బాక్సింగ్ లీగ్ 2025-26లో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో మానస స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు మానస పాఠశాల ప్రిన్సిపాల్ రజితరావు తెలిపారు. ఈ సందర్భంగా మానస పాఠశాల నుంచి 110 మంది విద్యార్థులు తమ ప్రతిభకనబర్చగా జగిత్యాల కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మోర సుమన్ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందించి, అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు, మౌనికరావులున్నారు.

అయ్యప్ప పూడిపూజ



అయ్యప్ప పడిపూజలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి అడ్లూరి

జగిత్యాల టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని మాజి మున్సిల్ చైర్మన్ గిరి నాగభూషణం నివాసంలో శనివారం శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరీ లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, మాజి మున్సిపల్ చైర్ పర్సన్‌లు అడువాల జ్యోతి లక్ష్మణ్, మెట్ట బట్టి, అయ్యప్ప ఆలయ అర్చకులు త్రిపాఠి మాతలు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

ధర్మపురి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో భీమనాతి అశోక్-మంగ దంపతులచే నిర్మించిన శ్రీ అయ్యప్ప దేవాలయంలో 19 వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి వారల విగ్రహాలకు గోదావరి జలంతో అభిషేకం జరిపి ఆరట్టు ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రవీందర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

జగిత్యాల అర్బన్, నవంబర్ 29(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని 25, 35 వ వార్డులలో చేపట్టిన అభివృద్ధి పనులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో చేయాలని, నిరంతర పర్యవేక్షణతో పనులను పరిశీలించారని సూచించారు.

హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం

కొడిమ్యాల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుటలో విఫలమైందని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ప్రతాపరామకృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో బీజేపీ మండల అధ్యక్షుడు బండ నర్సింహారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడారు.

డంపింగ్ యార్డు తరలింపు కోసం చర్యలు

ధర్మపురి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నది ఒడ్డున గల డంపింగ్ యార్డు తరలింపు కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని గోదావరి నది ఒడ్డున గల డంపింగ్ యార్డు సమస్యను స్థానిక నాయకులు ఆయన దృష్టికి తీసుక వెళ్లగా వెంటనే మంత్రి స్పందించారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో పాటు హైదరాబాద్ నుండి ప్రత్యేక రీసైక్లింగ్ నిపుణులను పిలిపించి డంపింగ్ యార్డు పరిస్థితిని శనివారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

మల్యాల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది మండలానికి చెందిన ఓ రాజకీయ నాయకునిపై శనివారం సీఐ రవికి ఫిర్యాదు చేశారు. ఆసుపత్రిలోని ల్యాబ్ టెక్నీషియన్‌కి ఫోన్ చేసి తమ వారికి ముందుగా రక్త నమూన పరీక్షలు చేయాలని ఆ నాయకుడు ఆదేశించాడని, మొదట గర్భిణీలకు పరీక్షలు చేస్తుండడంతో ఆగాలని పేర్కొన్నందుకు, ఆసుపత్రికి వచ్చి ల్యాబ్ టెక్నీషియన్‌పై దురుసుగా ప్రవర్తించారని పేర్కొన్నారు. చర్యలు తీసుకోవాలని వైద్యురాలు మౌనికతో పాటు వైద్య సిబ్బంది సీఐని కోరారు.

కొండగట్టులో భారీ అగ్నిప్రమాదం

- రూ.కోటికి పైగా ఆస్తి నష్టం



దుకాణాల్లో ఎగిసిపడుతున్న మంటలు

మల్యాల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలలోని దిగువ కొండగట్టు స్టేజీ సమీపంలో గల అభయాంజనేయస్వామి విగ్రహం ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలలో ఇరవైకి పైగానే బొమ్మల దుకాణాలు మంటల్లో బుగ్గి అయ్యాయి. మంటలు ఎగిసిపడడంతో దుకాణాలలోని జనాలు బయటకు పరుగులు పెట్టారు. దుకాణ సామాగ్రితో పాటు ఇంటి వస్తువులు, నగదుతో పాటు అనేక వస్తువులు కాలిపోగా కోటి వరకు ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. అభయంజనేయస్వామి విగ్రహం ప్రాంతంలో రహదారికి ఇరువైపులా అనేక దుకానాలు ఉంటుండగా షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. మంటలను స్థానికులతో పాటు ఫైర్ సిబ్బంది, పోలీసులు మంటలను నిలిపివేశారు.

మలి విడత నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు

జగిత్యాలరూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల్లోని గ్రామాల్లో ఆదివారం నుండి నామినేషన్ స్వీకరణ ప్రారంభమవుతుందని ఎంపీడీఓలు రమాదేవి, విజయలక్ష్మీ తెలిపారు. జగిత్యాల రూరల్ మండలవ్యాప్తంగా నామినేషన్ స్వీకరణకు 9 నామినేషన్ స్వీకరణ కేంద్రాలు, అర్బన్ మండలంలో ధరూర్, మోతె, తిప్పన్నపేట గ్రామాల్లో నామినేషన్ స్వీకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

●**రాయికల్:** స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా ఆదివారం నుంచి సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణ కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంపీడీవో చిరంజీవి రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు విధులు కేటాయించారు.

●**కొడిమ్యాల:** పంచాయతీ సర్పంచు, పంచాయతీ సభ్యుల ఎన్నికలకు సంబందించిన నామినేషన్ సామగ్రిని ఎంపీడీవో ఆర్.వో, ఏ.ఆర్.వో (రిటర్నింగ్ ఆఫీసర్)లకు అదనపు జిల్లా సహాయ ఎన్నికల అధికారి, ఎంపీడీవో స్వరూప అందించారు.

●**మల్యాల:** సర్పంచ్, వార్డుసభ్యుల నిమినేషన్లకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మల్యాల, ముత్యంపేట, తాటిపల్లి, తక్కళ్లపల్లి, రామన్నపేట, రాంపూర్‌లో నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. నామినేష్ కేంద్రాలను తహసీల్దార్ వసంత, ఎంపీడీవో స్వాతి, ఎస్సై నరేశ్‌కుమార్ పరిశీలించారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ జ్ఞానాన్ని పెంపొందించాలి



బహుమతులతో విద్యార్థులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆలోచనలే వారిని శాస్త్రవేత్తలుగా మారుస్తాయని, వాటికి తోడు కృషి చేస్తే అద్భుతాలు సృష్టించవచ్చునని జగిత్యాల విద్యాశాఖ అధికారి రాము, జేఎన్‌టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ వినోద్‌లు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురాతన పాఠశాలలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న 53వ జిల్లా స్థాయి బాలల వైజ్ఞానిక ప్రదర్శన 2025-26, ఇన్‌స్పైర్ అవార్డులు మానక్ వైజ్ఞానిక ప్రదర్శన శనివారం ముగిసింది. ఈ ప్రదర్శన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో 450 మంది బాల శాస్త్రవేత్తలు తమ నూతన ఆవిష్కరణలు ప్రదర్శించారన్నారు. వివిధ పాఠశాలల నుంచి సుమారు 3400మంది విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకించారన్నారు. అనంతరం ప్రదర్శనలో ప్రతిభ కనబర్చిన ప్రయోగాలకు బహుమతులు ప్రదానం చేశారు. ఏడు ఉప అంశాలకు సంబంధించి రాష్ట్రస్థాయికి జూనియర్ విభాగం నుంచి ఏడు, సీనియర్ విభాగం నుంచి ఏడింటిని ఎంపిక చేసినట్లు తెలిపారు. 111 ఇన్‌స్పైర్ ప్రదర్శనలకు గానూ 11 ప్రదర్శనలు రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ ముగింపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే ప్రదర్శించబడిన పలు నృత్యప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల ఎంఈవోలు, ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిట్‌లో భాగంగా జ్యోతి హై స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థిని చైత్ర తన హెల్త్ హైజీన్ మోడల్‌తో నిర్వహించిన ఆరోగ్య పరిరక్షణపై అవగాహన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ మోడల్ ద్వారా వ్యక్తిగత శుభ్రత, పోషకాహారం ప్రాముఖ్యత, చెడు అలవాట్ల వల్ల కలిగే కలిగే ప్రమాదాలు, శుభ్రమైన పరిసరాలు, ఆరోగ్యంకోసం అనుసరించాల్సిన రోజువారి పద్దతులు వంటివి ఈ ప్రదర్శనలో వివరించారు.

పోలీస్ సేవలు మరవలేనివి

ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో గత 40 సంవత్సరాలుగా విధులు నిర్వహించిన ఏఆర్ ఎస్ఐ రాజేశ్వర్ సేవలు మరువలేనివని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కోన్నారు. జగిత్యాల ఏఆర్ ఎస్ఐగా పని చేసి పదవి విరమణ పొందుతున్న రాజేశ్వర్ దంపతులను జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో బావి జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఎలాంటి సమస్య వచ్చన తనను సంప్రదించ వచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు కిరణ్ కుమార్, వేణు, సైదులు, సిబ్బంది పాల్గోన్నారు.

సర్పంచ్ ఎన్నికలో తల్లీకూతుళ్ల నామినేషన్





తిమ్మయ్యపల్లి స్థానానికి నామినేషన్ దాఖలు చేస్తున్న తల్లి గంగవ్వ, కూతురు సుమలత

కోరుట్ల రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం తిమ్మయ్యపల్లి సర్పంచ్ స్థానానికి శనివారం తల్లీకూతుళ్ల నామినేషన్లు దాఖలు చేశారు. కోరుట్ల మండలం తిమ్మయ్యపల్లి గ్రామం బీసీ మహిళకు రిజర్వ్ కాగా గంగవ్వ అనే మహిళ నామినేషన్ వేయగా, ఆమె కూతురు సుమలత కూడా నామినేషన్ సమర్పించింది. సుమలత కొన్ని రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన పల్లెపు అశోక్ అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకుంది. దీంతో ఇరు కుటుంబాల మధ్య కలహాలు జరిగాయి. ఈ నేపథ్యంలో తల్లీకూతుళ్లు సర్పంచ్ పదవి కోసం నామినేషన్లు దాఖలు చేయడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.